విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

శుక్రవారం 3, జనవరి 2025 | 8 పేజీలు

శాశ్వత భూ సమస్య పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆర్డీవో శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని అందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతోందని ఇందులో వచ్చిన అర్జీలను ఎప్పటి కప్పుడు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నార న్నారు. మండల టీడీపీ యువ నాయకుడు మదన్ మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని గతంలో జరిగిన భూ అవతవకలపై విచారణ జరిపి నిజమైన లబ్ధిదారులకు అధికారులు న్యాయం చేయాలని ఇది ప్రజల ప్రభుత్వంని ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడడం అధికారుల బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ శ్రీనివాసులు, మండల టిడిపి యువ నాయకులు మదన్ మోహన్ , రెవెన్యూ, సచివాలయం సిబ్బంది, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్ల ధ్రువీకరణ పరిశీలనను పక్కాగా చేయాలి

కలెక్టర్ శ్రీధర్ చామకూరి

విశాలాంధ్ర-రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాల మేరకు జిల్లాలో వికలాంగుల పెన్షన్ల ధ్రువీకరణ పరిశీలన కార్యక్రమాన్ని పక్కగా చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, గ్రామీణ అభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మరియు సెర్ఫ్ సీఈవో వీర్య పాండ్యన్ సదరం వైకల్య ధ్రువీకరణ పత్రాల స్క్రీనింగ్ నూతన మార్గదర్శకాలపై జిల్లా కలెక్టర్లు, డిఆర్డిఏ, వైద్యారోగ్య, మున్సిపల్, జిఎస్డబ్ల్యూఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ఫ్ సీఈవో వీర్య పాండ్యన్ ప్రభుత్వం ద్వారా జారీ చేయనున్న నూతన మార్గదర్శకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో అవగాహన కల్పించారు. సమావేశం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయనున్న మార్గదర్శకాలను అనుసరించి సదరం వైకల్య ధ్రువీకరణ పత్రాల స్క్రీనింగ్ నిమిత్తం జిల్లాస్థాయిలో ఒక బృందాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 1600 మంది వరకు 85శాతం పైబడి వైకల్యత్వం కలిగిన వారు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయని, వాటిని పరిశీలించాల్సిన బృందాల సంఖ్య ప్రకారం రూట్ మ్యాప్ ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ, వైద్యారోగ్య, పంచాయితీ, జిఎస్డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్త కావాలి

మోరగుడి సభలో కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖమంత్రి డా. జితేంద్ర సింగ్

విశాలాంధ్ర - జమ్మలమడుగు : స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రతి మహిళా ఒక పారిశ్రామిక వేత్తగా ఎదగాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం.. అని కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖమంత్రి డా. జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు.ఆకాంక్ష జిల్లా, బ్లాకుల అభివృద్ధి పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వచ్చిన కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖమంత్రి డా. జితేంద్ర సింగ్.. గురువారం సాయంత్రం జమ్మలమడుగు మండలం మోరగుడి ఎస్.ఆర్. ఫంక్షన్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి, సాధికారిత, పొదుపు సంఘాల బలోపేతంలోనే సాధ్యం అవుతుందని.. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత సాధనకు కృషి చేస్తోందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఎన్నో రకాల సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సహకారంతో.. ఆర్థిక పరిపుష్టిని సాధించాయన్నారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతీ ఒక్కరూ ఎదో ఒక రంగంలో స్వయం ఉపాధిని పొందుతున్నారంటే.. జిల్లా యంత్రాంగం ఎంతొ కృషి చేస్తోందని అందుకు అభినందనలు తెలుపుతున్నానన్నారు. ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను అందిపుచ్చుకుని.. ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా రాణించాలన్నారు. ప్రతి మండలం నుండి చురుకుగా ఉన్న స్వయం సహాయక గ్రూపులను గుర్తించి.. వారిని ఈ కామర్స్ బిజినెస్ లోకి అడుగులు వేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. అంతేకాకుండా వారికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు సరైన శిక్షణ కూడా ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆ విధంగా జిల్లా నుండి అత్యంత నాణ్యతా ప్రమాణాలను.. కలిగిన వందలాది రకాల ఉత్పత్తులను రూపొందిస్తున్నామన్నారు. ప్రతి గ్రామీణ మహిళను గ్లోబల్ బిజినెస్ ఉమెన్ గా ప్రోత్సహిస్తున్నామన్నారు. అపుడే గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత రెండూ ఫలిస్తాయన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా.. ప్రాథమిక సెక్టారులోని వ్యవసాయం, ఇండస్ట్రియల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇప్పటికే జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎన్నో మహిళా సంఘాలు వివిధ రకాలుగా స్వయం ఉపాధి అవకాశాలు పొందుతున్నారన్నారు. ఆకాంక్ష జిల్లా, బ్లాకుల లక్ష్య సాధనలో జమ్మలమడుగు మండలం వంద శాతం పురోగతిని సాధిస్తుందన్నారు. అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహించడంలో జమ్మలమడుగు ముందంజలో వుందన్నారు. ఆకాంక్ష బ్లాకులో భాగంగా జమ్మలమడుగు మండలంలోని మోరగుడి పొదుపు సంఘాలు ముందవుగులో ఉన్నాయన్నారు. జమ్మలమడుగు నియోజక వర్గాన్ని దేశంలోనే ఒక పారిశ్రామిక, ఉపాధికి ఊతమిచ్చే వనరుగా అభివృద్ధి చెందుతోందన్నారు. అందుకు తగ్గట్లుగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహాయ సహకారాలకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. అనంతరం మోరగుడి ప్రభుత్వ పాఠశాలలో అన్ని సదుపాయాలతో ఎస్హెచ్జీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ కిచెన్ నిర్మాణం కోసం శిల ఫలకాన్ని కేంద్రమంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముందుగా కేంద్రమంత్రి మహిళా సంఘాల -2లో

చింతకొమ్మదిన్నెలో పర్యటించిన కేంద్ర మంత్రి

విశాలాంధ్ర:-కడప: అకాంక్షాత్మక అభివృద్ధి జిల్లా పథకం పర్యవేక్షణ మరియు మూల్యాంకనంలో భాగంగా కడప జిల్లా విచ్చేసిన కేంద్ర మంత్రివర్యులు జితేంద్రసింగ్ రాణా ఆ పథకం క్రింద ఎంపికై అకాంక్షాత్మక అభివృద్ధి మండలంగా ప్రకటించబడి యున్న చింతకొమ్మదిన్నె మండలం లోని వివిధ ప్రభుత్వ విభాగాలను సందర్శించడం జరిగింది. ఆయన సందర్శనలో ముందుగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బుగ్గలపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను సందర్శించడం జరిగింది. జిల్లా వైద్య

ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు గారు కేంద్రమంత్రివర్యులు శ్రీ జితేంద్రసింగ్ రాణా గారికి సాదరంగా స్వాగతించడం జరిగింది. స్థానిక వైద్యులు డాక్టర్ రాఘవేంద్ర డాక్టర్ సునీత లు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రం ద్వారా ప్రజలకు అందచేయబడుతున్న సేవలను వివరించడం జరిగింది. మంత్రివర్యులు అక్కడి సేవలను పరిశీలించి పురోగతిని సమీక్షించడం జరిగింది. అనంతరం వివిధ ఆరోగ్య పథకాల లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన లబ్ధిదారులకు కార్డులను అందచేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఈ పథకం ద్వారా దేశంలో ఎక్కడైనా గుర్తింపుపొందిన ఆసుపత్రులలో 5 లక్షల రూపాయల విలువైన వైద్య చికిత్సలు పొందవచ్చని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ గారు, కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సభ్యులు శ్రీ కృష్ణ చైతన్య రెడ్డి గారు, జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ సభ్యులు శ్రీ ఆదినారాయణ రెడ్డి గారు ప్రత్యేక అతిదులుగా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఉప ఆరోగ్య వైద్య శాఖాధికారులు డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డాక్టర్ నాగ శశిభూషణ్ రెడ్డి గారు, జిల్లా గణాంకాధికారి రమేష్ రెడ్డి గారు, జిల్లా మాస్ మీడియా విభాగానికి చెందిన జిల్లా డెమో దేవిరెడ్డి భారతి గారు, డిప్యూటీ డెమో రమణమ్మ గారు, కుమారి గారు , మాణిక్యమ్మ గారు సమన్వయము చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సమాజ ఆరోగ్య అధికారి తోట సుకుమారన్ గారు వారి ఆరోగ్య పర్యవేక్షకులు, స్థానిక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆరోగ్య అధికారి, ఏ.ఎన్.ఏం మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు .

నేడు ఏకసభ్య కమీషన్ అభిప్రాయసేకరణ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎస్సీ వర్గీకరణ అంశంలో ప్రభుత్వం శ్రీ రాజీవ్ రంజన్ మిశ్రా ఆధ్వర్యంలో ఏకసభ్య కమీషన్‌ను నియమించడం జరిగిందని ఈ కమీషన్ నేడు శుక్రవారం కడప కలెక్టరేట్‌ను చేరుకుంటుందని ఏఎస్‌డబ్ల్యుఓ స్వర్ణలత తెలిపారు. ఈ మేరకు ఉదయం 10.30 నుండి కలెక్టరేట్‌లోని సభాభవనంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎస్సీ ఉప కులాల సభ్యులు, సంఘాల వారు హాజరై తమ అభిప్రాయాలను వినతిపత్రాల రూపంలో అందించవచ్చునని ఆమె వివరించారు. కార్యక్రమానికి వచ్చే వారు ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని ఏఎస్‌డబ్ల్యుఓ తెలిపారు.

యాజమాన్య కమిటీ ఒక్క రోజు శిక్షణ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశా లల యాజమాన్య కమిటీ సభ్యులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాలుగు దశల్లో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందులో భాగంగా మొదటి రెండు దశలు పూర్తికాగా మూడవ దశ మండల స్థాయిలో కార్యక్రమా న్ని నిర్వహించారు. ఎంఈఓ-1 శివప్రసాద్, ఎంఈవో-2 రామాంజనేయరెడ్డితో పాటు రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు. వీరు యాజమాన్య కమిటీ సభ్యుల యొక్క బాధ్యతలు, విధులపై వివరిం చారు. కమిటీ సభ్యులు వారానికి ఒకమారు పాఠశాలలను సందర్శిం చి ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్ల నిర్వహణ పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన మేర దాతల నుండి నిధులను సేకరించి పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : బి.కోడూరు మండల శాఖ ఆధ్వర్యంలో ఈరోజు జడ్పీహెచ్ఎస్ ఆదిత్య రామ్ పేట, బికోడూ రు పాఠశాలల యందు గౌరవ మండల విద్యా శాఖ అధికారి ద్వారా పదవ తరగతి విద్యార్థు లకు రాష్ట్రోపాధ్యాయ సంఘం నిపుణుల చేత తయారు చేయించ బడిన స్టడీ మెటీరియల్ను అందజేయడమైనది ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ గారు శ్రీమతి శ్రీలత మేడం గారు జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్‌ఎం గారైన శ్రీ జి పెంచలయ్య గారు పాఠశాల సిబ్బంది మరియు ఎస్టీయూ సంఘం నాయకులు కె .కుమార్ బాబు , బి. శ్రీనివాసులు , కాసిం పీరా, ఇన్నయ్య ,నాగ సుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి, ఖదీర్ భాష ,రామ సుబ్బారెడ్డి, రాజగోపాల్ రెడ్డి ,సుబ్బయ్య ,కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చక్కటి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారుప్రశంసించడం జరిగింది.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

విశాలాంధ్ర-సుండుపల్లె: ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని మండల విద్యాశాఖ అధికారులు వెంకటేష్ నాయక్, రవీంద్ర నాయక్ లు తెలిపారు గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ప్రతి పాఠశాల నుండి విద్యార్థుల తల్లిదండ్రులు ఒకరు కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. అలాగే నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల చైర్మన్లు లేదా విద్యార్థుల తల్లిదండ్రులు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయాలని తెలిపారు. బడి బయటి పిల్లలను బడికి రప్పించేలా చూడాలన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్‌లు, సీఆర్పీలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్టీయు క్యాలెండర్, డైరీ-2025 ఆవిష్కరణ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : పోరు మామిళ్ల మండల శాఖ క్యాలెండర్, డైరీ ని మండల విద్యా శాఖ అధికారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీ రామిరెడ్డి,డాక్టర్ శ్రీ కరిష్మా ,పశువైద్యాదుకారులు చెన్నారెడ్డి,వెంకటేశ్వర్లు గార్ల చేతుల మీదుగా క్యాలెండర్, డైరీ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే నని, బావి భారత పౌరులను తయారు చేసేది ఉపాధ్యాయులే కావున పిల్లలకు చదువు తో పాటు నైతిక విలువలు బోధించాలని అలాంటప్పుడే సమాజములో అసాంఘిక కార్యకలా పాలు జరగ కుండా ఉంటాయన్నారు. డైరీ ఉపాధ్యా యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అన్ని విషయా లు దీనిలో పొందుపరచడం జరిగిందని తెలియజేస్తూ మన దగ్గరకు వచ్చే పేద బడుగు బలహీన వర్గాల వారికి నాణ్యమైన విద్య నందించాలని తెలియజేశారు, సంఘాల సమిష్టి గా ఉన్నప్పుడే ఏవైనా సాదించుకోగలమని, ఎందరో త్యాగదనుల పలితంగా ఈరోజు మనం అనుభవిస్తున్న ఫలాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి పి. రమణారెడ్డి,రాష్ట్ర కళావేదిక కో కన్వీనర్ యమ్. రామకృష్ణారెడ్డి గారు,రాష్ట్ర కౌన్సిలర్ చంద్రహాసరెడ్డి గారు, జిల్లా కార్య వర్గ సభ్యులు పుల్లారెడ్డి, గురయ్య, శ్రీనివాసులు,కమిటీ కన్వీనర్ లు కో-కన్వీనర్ లు అబ్దుల్ హుస్సేన్,ఆనంద్, అధ్యక్ష ప్రధాన,ఆర్థిక కార్యదర్శులు, పుల్లయ్య, జయరామి రెడ్డి, బాష,రీజనల్ కో-కన్వీనర్ రమణయ్య,మండల కార్యవర్గ సభ్యులు జనార్ధన్ సెట్టి, సుబ్బారావు, ,జాఫర్ ,ప్రకాష్ రావు, డి. యల్. చంద్రశేఖర్,చెన్నయ్య,అబ్దుల్ సలాం,గరుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: రాష్ట్రోపాధ్యాయ సంగం రాష్ట్ర అకాడమిక్ కమిటీ రూపొందించినటు వంటి పదవ తరగతి స్టడీ మెటీరియల్ కడప ఉప విద్యాధికారి జి.రాజగోపాల్ రెడ్డి నగర పాలకు ఉన్నత పాఠశాల మెయిన్ నందు ఆవిష్కరించారు. ఎస్.టి.యు సంఘం సామాజిక బాధ్యతగా పదవ తరగతి విద్యార్థుల శ్రేయస్సు కొరకై ప్రభుత్వ ఉపాధ్యా యుల రూపొందించినటువంటి ఈ మెటీరియల్ చాలాబాగా ఉందని కొనియాడారు.. విద్యార్థులు ఈ మెటీరియల్ ఉపయోగించుకొని ప్రతి ఒక్కరూ మంచి మార్కులు, అలాగే తరగతి మొత్తం మంచి ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేయాలని కోరారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు నాగమణి, ఎస్టియు జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ భాష మాట్లాడు తూ భవిష్యత్తులో ఇంకా బాగా రూపొందించేటందుకు ఈ మెటీరియల్ ను ఉపాధ్యాయులు పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇవ్వవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు ఎస్.టి.యు రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ టి.రవి శంకర్ రెడ్డి ఉచితంగా మెటీరియల్ అందజేయడంపై ఉప విద్యాధికారి అభినందించారు, ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా నాయకులు మహబూబ్ బాషా, అబ్దుల్ వాజీద్, దామోదర్, అబ్దుల్ సత్తార్, పాఠశాల ఉపాధ్యాయులు సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: చిన్నారులు ఎదుర్కొనే వ్యాధుల పట్ల అవగాహన అవసరమని ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు, గోల్డ్ మెడలిస్ట్ డా. పిబి. రుఖియా అన్నారు. గురువారం కడప నగరంలోని ఐటిఐ సర్కిల్ లోని ఎంఆర్ హాస్పిటల్లో చిన్నపిల్లల వైద్య విభాగాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ రుబియా మాట్లాడుతూ చిన్నపిల్లలు కలిగిన తల్లిదండ్రులు పిల్లల అరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధుల బారిన పడిన వెంటనే సంబంధిత నిపుణుడైన వైద్యులను సంప్రదించాలని తెలిపారు. పిల్లల ఆరోగ్యానికి సంబందించిన పాత రికార్డులను తీసుకురావాలని చెప్పారు. ఐటిఐ సర్కిల్ పరిసర ప్రాంతాల్లో ని చిన్నారుల అరోగ్య సమస్యల పరిష్కారానికి అన్నివిధాలా అందుబాటులో ఉంటానని తెలిపారు. తక్కువ ఖర్చులతో కూడిన వైద్య సేవలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కడప నగరం ఐటిఐ సర్కిల్ దగ్గర గల ఎం.ఆర్ హాస్పిటల్ లో అత్యాధునిక వైద్య సేవలు ప్రారంభించాలని తెలిపారు. ఐ.టి.ఐ సర్కిల్, ఊటుకూరు, భగత్ సింగ్ నగర్, చింతకొమ్మదిన్నె గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని తెలి యజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మైనారిటీ ఈ.డీ డాక్టర్ వి .బ్రహ్మయ్య, డాక్టర్ హిదాయతుల్లా , అరుణాచల హాస్పటల్ డాక్టర్ కరీముల్లా, ఆయిల్ మిల్ ఓబులేసు, టీచర్ అజ్మతుల్లా, హబీబుల్లా, రాయల్ ఫర్నిచర్ రాయల్ బాబు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

అపాస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంఈఓ

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం లక్కిరెడ్డిపల్లి మండల శాఖ క్యాలెండర్‌ను స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం మండల విద్యాశాఖ అధికారి యం.చక్రే నాయక్ ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపాస్ దయ నందిని కాలమానిని చాలా బాగున్నాయని దేశభక్తిని పెంపొందించే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, వేణుమాధవ్ రాజు, జిల్లా కార్యదర్శి బాలరాజు, జిల్లా ఉపాధ్యక్షులు నాగులయ్య, జిల్లా మీడియా ఇన్చార్జ్ కె.వెంకటేశ్వర్లు, సాయి చరణ్ యాదవ్, మల్లయ్య, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి నాయక్, శంకరయ్య, నారాయణ నాయక్, రవి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చౌకదుకాణాల భర్తీకి చర్యలు

తాహసీల్దార్ శోభన్‌బాబు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండలంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ చౌక దుకాణాలకు డీలర్లను ఎంపిక చేసేందుకు వీలుగా నోటిఫికేషన్ విడుదల అయింది. ఈ ప్రక్రియ ద్వారా మండల వ్యాప్తంగా 25 చౌకదు కాణాలకు నూతనంగా డీలర్లను నియమించ నున్నారు. ఇందులో తాజాగా 6 కొత్త దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అర్హులైన వారు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంది. 17వ తేదీన వ్రాత పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రం వివరాలను హాల్‌టికెట్‌లో పొందుపరచడం జరుగుతుందని మండల తాహసీల్దార్ శోభన్ బాబు తెలిపారు. 18 సంవత్సరముల నుంచి నోటిఫికేషన్ విడుదల నాటికి 40ఏళ్లలోపు వారు దరఖాస్తుకు అర్హులని ఆయన తెలిపారు. ఇంటర్మీడియెట్, ఎస్ఎస్‌సిలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అలాగే అర్హత కలిగి ఆసక్తి ఉన్న వారు చౌకదుకాణమునకు కేటాయించిన రిజర్వేషన్ మేరకు దరఖాస్తులు నమోదు చేసుకోవాలని తాహసీల్దార్ సూచించారు.

పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-సిద్దవటం : మండలంలోని మాధవరం-1 పంచాయతీ బంగారుపేట అంగన్వాడి కేంద్రంలో భాకరాపేట సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలకు గురువారం ప్రీస్కూల్ విద్యార్థులకు అందించే పిపి -1 పిపి -2 పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీవిద్య మాట్లాడుతూ..కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పిల్లల్లో మేధాశక్తి సృజనాత్మకత పెంపుదల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. అంగన్వాడి కేంద్రంలో ప్రతినెలా 5వ తేదీన ఈసీసీఈ డే నిర్వహించి పిల్లల తల్లిదండ్రులకు పిపి-1, పిపి-2 పుస్తకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రీస్కూల్ పిల్లల నమోదుకు పిల్లల తల్లిదండ్రులు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

..పారిశ్రామికవేత్త కావాలి

(మొదటి పేజీ తరువాయి) సభ్యులు వారు నిర్వహిస్తున్న స్వయం ఉపాధి యూనిట్ల స్టాళ్లను పరిశీలించి.. మహిళలతో మాట్లాడారు. ఆనంతరం పలువురు మహిళలు వారి మనోగతాన్ని వెళ్లబుచ్చారు. ఈ కార్యక్రమంలో పీఎస్ పంకజ్ దీక్షిత్, పీఐబీ డైరెక్టర్ నంద కిషోర్ రెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ, డీఆర్డీఏ, డ్వామా పిడీలు ఆనంద్ నాయక్, అదిశేషారెడ్డి లతో పాటు మహిళా సంఘాల సభ్యులు, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామ గిద్దయ్య కలిసిన ఎన్జీవో నాయకులు

విశాలాంధ్ర-కడప :కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ బి.రామగిద్దయ్యకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేసిన ఏపీ.ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్,రాయచోటి ఏపీ.ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షులు యమ్. వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శి డి వెంకటేశ్వర్ రెడ్డి, రాయచోటి ఏపీ ఎన్జీఓ నాయకులు బి. దేవేంద్ర, డి. శివారెడ్డి, పద్మనాభం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డును పునరుద్ధరించాలని

6న కలెక్టరేట్ వద్ద నిరాహారదీక్ష

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 6వ తేదిన సోమవారం నాడు కడప కలెక్టరేట్ వద్ద నిరాహారదీక్ష చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికసంఘం ప్రొద్దుటూరు ఏరియా సమితి(ఏఐటీయూసీ అనుబంధం) పూసల యేసోబు(చిన్న ఓబన్న) తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నుండి రావాల్సిన క్లైములను పెన్షన్లను స్కాలర్‌షిప్‌లను ఇవ్వకుండా గత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ కాలంలో సెస్సు రూపంలో వచ్చిన కోట్ల రూపాయలు నిధులను దారి మళ్లించి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి అందులో జమ అయి ఉన్నా డబ్బంత సొంత ప్రయోజనాలకు వాడుకొని కార్మికులకు మొండిచేయి చూపించారని అన్నారు. ఎన్నిసార్లు నిర్మాణ రంగ కార్మికులు పోరాడిన ఫలితం లేకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఇటు కోర్టును అటు భవన నిర్మాణ కార్మికులను మోసం మూలంగానే జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠంచెప్పారని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు కావస్తున్న ఒక ఉచిత ఇసుక పాలసీ మాత్రమే చేసి మా సంక్షేమ బోర్డును మా కార్మికుల సమస్యలను బోర్డులో ఉండే క్లైములను ఏవి కూడ పట్టించుకోకుండా పబ్బం గడుపుతున్నారని అన్నారు. అదేవిధంగా సంక్షేమ బోర్డును పునర్ నిర్మించాలని కోరుతూ ఉఆన్నమని మా బాధలు మీరు సట్టించుకోనందు వల్ల 6వ తేదిన సోమవారం నాడు కడప కలెక్టర్ ఆఫీస్ దగ్గర నిరాహారదీక్షను చేస్తున్నట్లు తెలిపారు.

టిడిపి నాయకుడు మృతదేహానికి

నివాళులర్పించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

విశాలాంధ్ర -బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలోని పలుగురాళ్లపల్లె పంచాయతీ పంచాయతీ పరిధిలో ఉన్న బొగ్గుల వారి పల్లె గ్రామానికి చెందిన తెలుగుదేశం సీనియర్ నాయకులు వీరారెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో సమాచారం అందుకున్న మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ తన సొంత పంచాయతీ పలుగురాళ్లపల్లె బొగ్గుల వారి పల్లె తనకు స్నేహితునిగా మంచి నాయకునిగా తన ఊరు పక్కనే ఉండేవాడని ఆయన అకాల మరణం మరణం చెందడం బాధాకరమని ఆయన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు వీరారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈయనతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు మీసాల దుగ్గిరెడ్డి బాలదుగ్గిరెడ్డి రామసుబ్బయ్య తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలుగుదేశం వాటర్ షెడ్ చైర్మన్ రాజారెడ్డి టీవీ ఫైవ్ స్టాఫ్ రిపోర్టర్ రమణారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎల్లటూరి సాంబశివారెడ్డి, ఎస్సార్ శ్రీనివాస్ రెడ్డి, పూజ శివ యాదవ్, లగసాని వీరయ్యయాదవ్, లగసాని గంగరాజు, సుధాకర్ యాదవ్ నాగయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై మౌనం సరికాదు

క్యాలెండర్ ఆవిష్కరణలో ఎస్టీయు నాయకులు

విశాలాంధ్ర-కలసపాడు : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మౌనంగా ఉండటం తగదని ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.శేఖర్ బాబులు పేర్కొన్నారు. గురువారం కలసపాడులో నిర్వహించిన ఎస్టీయు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న రమణారెడ్డి, శేఖర్ బాబులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తయినప్పటికీ ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సంవత్సరకాలంగా, నెలలుగా పెండింగులో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులు, హాఫ్ పేలీవ్ ఎన్ క్యాష్ మెంట్, జడ్పీపిఎఫ్ ఏపిజిఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్లు, పీఆర్సీ, డిఎ బకాయిలు చెల్లించకపోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారనీ ప్రతి నెలా జీతాలనుండి మినహాయించి పొదుపు చేసుకున్న వాటిని కూడా చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. పీఆర్సీ గడువు ముగిసి ఒకటిన్నర సంవత్సర కాలమైనా కమిటీపై కాని, మధ్యంతర భృతిపై కాని దృష్టి సారించకపోవడం సాంప్రదాయాలను తుంగలో తొక్కడమేనన్నారు. రెండవ తేదీ జరిగిన మంత్రివర్గ సమావేశంలో మధ్యంతర భృతి, డిఎలపై ప్రకటన చేస్తారని ఉద్యోగులంతా ఎంతో ఆశగా ఎదురు చూసినప్పటికీ, ఎలాంటి చర్చగాని, నిర్ణయాలుగానీ తీసుకోక పోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనయ్యారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని పెండింగ్ బకాయిలు చెల్లించడంతో పాటు, డిఎ బకాయిలను వెంటనే ప్రకటించాలన్నారు. అలాకాక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఇదే ధోరణిని అను సరిస్తే మాత్రం తగిన ఉద్యమ కార్యాచరణ చేపట్టక తప్పదన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంఇవోలు పి.ఎమ్.ప్రేమసాగర్, ఎస్.మస్తాన్ వలి, మండల శాఖ అధ్యక్షప్రధాన కార్యదర్శులు సి.వెంకటరెడ్డి, బి.ఎన్.వి. ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు మెర్సీ మాలిని, కమాల్, రెడ్డిజ్యోతి, ఎస్టీయు నాయకులు శివారెడ్డి, బాలరాజు నాయక్,విజయభాస్కర్ రెడ్డి, నాగిరెడ్డి, రవిక్రీస్తుధారి, విన్సెంట్ రాజు, వీరనారాయణరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, వీరారెడ్డి, మస్తాన్, గురుప్రసాద్, రామచంద్రారెడ్డి, శోభారాణి, నిర్మలమ్మ, జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

5 వ తేదీ నుండి బ్రహ్మసాగర్

ఎడమ కాలువకునీరు నిలుపుదల

పదిరోజుల తరువాత మళ్ళీ నీరు విడుదల
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణా రెడ్డి

విశాలాంధ్ర- బ్రహ్మంగారి మఠం : మండల కేంద్రము పరిధిలో బ్రహ్మసాగర్ రిజర్వాయర్ నుండి ఎడమ కాలువ ద్వారా రైతుల వ్యవసాయ పంటపొలాలకు చెరువులకు నీటిని ఇవ్వడం జరిగిందని అందులో భాగంగానే ఈ నెల 5 వ తేదీ ఆదివారం నుండి నీటిని నిలిపివేస్తున్నట్లు తెలుగు గంగ ప్రాజెక్టు పోరుమామిళ్ళ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కృష్ణారెడ్డి పేర్కొన్నారు . ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ, బ్రహ్మసాగర్ రిజర్వాయర్ నుండి ఎడమ కాలవ పరిధిలో బ్రహ్మంగారి మఠం, పోరుమామిళ్ల కలసపాడు, కాశి నాయన మండలంలోని రైతులు ఈ విషయాన్ని పరిగణనలో పెట్టుకొని నీటిని వాడుకోవాలని ఆయన అన్నారు, ప్రభుత్వ టెండర్ల ప్రకారం, బ్రహ్మసాగర్ ఎడమ కాలువ పరిధిలో ఉన్న అనుసంధాన కాలువలు, పిల్ల కాలువలు, అలాగే చెరువులు మొదలగు కాలువల ఇరువైపులా పెరిగి పోయిన కంపచెట్లు (జంగిల్ క్లియరెన్స్) తొలగించే పనులు జరుగుతు న్నాయని, అందువలన బ్రహ్మసాగర్ ఎడమ కాలువనుండి రైతుల వ్యవసాయ పొలాలకు వచ్చే నీటిని ఈనెల 5 వ తేదీ అనగా ఆదివారం నుండి నిలిపి వేసి, మళ్ళీ ప్రభుత్వ అనుమతితో శాసన సభ్యులు ఆదేశాలతో పదిరోజుల తరువాత నీటిని వదులుతామన్నారు. కాబట్టి బ్రహ్మసాగర్ ఎడమ కాలువ పరిధిలో ఉన్న రైతులు పంటలకు వ్యవసాయ నీటిని అందిస్తామని ఏ ఒక్క రైతు ఆందోళన చెందవద్దని ఆయన తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఒక్క రైతుకూడ పిల్ల కాలువలపై కంప చెట్లను తొలగించే పనులకు సహకరించాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీ

విశాలాంధ్ర- అట్లూరు : బద్వేల్ -కడప ప్రధాన రహదారి రెడ్డిపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో అట్లూరు ఎస్సై రామకృష్ణ గురువారం వాహన తనిఖీ లు నిర్వహించారు. జిల్లా ఇంచార్జ్ఎస్పీ విద్యా సాగర్ నాయుడు ఆదేశాల మేరకు విజుబుల్ పోలీసింగ్ లో భాగంగా ఈతనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది భాస్కర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ముక్కా ఫౌండేషన్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : పేద విద్యార్థులకు ముక్కా రూపానం దరెడ్డి ఫౌండేషన్ ఆధారంగా ఏర్ప డింది. పెనగ లూరు మండలం లోని కొండూరు గ్రామానికి చెందిన పసుపులేటి పద్మజ భర్త రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందారు. ఇంటి యజమాని చనిపోయిన తరువాత ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. దీంతో కుమారుడి చదువుకు కళాశాల ఫీజు కట్టలేని పరిస్థితిలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మానవత దృక్పథంతో కడప కుడా డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి దృష్టికి తీసుకురావడంతో తక్షణం స్పందించిన రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా కళాశాల ఫీజు కొరకు రూ.25,000 చెక్ వ్రాసి బాధితురాలుకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ పేద, బడుగు, బలహీన వర్గాల వారిని ఆపద్బాంధవులా అదుకుంటున్నది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతను చాటుకున్న వీఆర్ఏలు

ఆర్థిక సాయం అందించిన సంఘం నేతలు

విశాలాంధ్ర- అట్లూరు:ఆంధ్రప్రదేశ్ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం ఇటీవల తీవ్రమైన అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయించుకుని బద్వేల్ లోని తన నివాస గృహంలో విశ్రాంతి పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వీఆర్ఏల సంఘం (సిఐటియు అనుబంధం) కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లిపోగు నాగేశంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు .అదే విధంగా ప్రస్తుతం రోజువారి మందులు. మాత్రలు ఇతర వైద్య ఖర్చులు నిమిత్తం రూ. 10.000 /- (పది వేలు రూపాయలు) ఆర్థిక సహాయం అందించి తమ ఐక్యతనుచాటుకున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని వీఆర్ఏ లు అందరూ తమ వంతు ఆర్థిక సహాయం అందించారని భవిష్యత్తులో ఒకరికొకరం సహాయం చేసుకుంటూ ఐక్యంగా నిలబడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు - అనుబంధం) కడప జిల్లా అధ్యక్షులు నాగేంద్ర.జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి.జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దొడ్డబియ్యం ఇంకెన్నాళ్లు

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : పేద ప్రజలకు బ్రాండ్ దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వాలు పంపిణీ చేయడం విచారకరం దేశానికి స్వాతంత్రం సిద్ధించి 78 సంవత్సరాల గడుస్తున్న పేదల ఇంకా దొడ్డు బియ్యం పంపిణీ చేయడం విస్మయానికి గురిచేస్తుంది చౌక దుకాణాల ద్వారా ప్రతినెల ఒక మనిషికి ఐదు కిలోలు చొప్పున దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్నాయి పేద ప్రజలు ఆకలితో అలంపించకూడదని ఉద్దేశంతో చౌక దుకాణాలు ద్వారా ప్రభుత్వాలు దొడ్డు బియ్యాన్ని పంపిణీ చేస్తున్నాయి దొడ్డిబియ్యాన్ని సంక్షేమ హాస్టళ్లకు గురుకుల పాఠశాలలకు ప్రాథమిక ప్రాథమికోన్నత హై స్కూల్ అంగన్వాడి స్కూల్ లకు దొడ్డిబియ్యం అన్నం పంపిణీ చేస్తున్నారు చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నారని అనుకోవడం పొరపాటే చిన్నారులకు స్కూళ్లలో హాస్టళ్లలో దొడ్డిబియ్యం పంపిణీ చేయడం శోచనీయం బహిరంగ మార్కెట్లో కిలో బియ్యం20 రూపాయలు ఉన్న సమయంలో పేదలు ఆకలితో అలమటించ కూడదని ఉద్దేశంతో దివంగత సీఎంఎన్టీఆర్ కిలో రెండు రూపాయలకే చౌకు దుకాణాల ద్వారా పంపిణీ చేశారు అనంతరం వచ్చిన ప్రభుత్వాలు కిలో ఐదు ఒక రూపాయి తో పంపిణీ చేశారు ప్రభుత్వం ఉచితంగా దొడ్డు బియ్యాన్ని పేద ప్రజలకు చౌక దుకాణంద్వారా పంపిణీ చేస్తున్నారు పేదల బ్యాండ్గా ఉన్న దొడ్డి ప్యాడ్ ని రాజకీయ నాయకులు ఏనాడైనా తింటున్నారని ఆలోచించాలి ప్రస్తుతం కూలి నాలి చేసుకుంటున్న పేదల సైతం దొడ్డు బియ్యం తినడానికి ఇష్టపడడం లేదు చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేసే దొడ్డిబియ్యం మార్కెట్లో కిలో ?10 కు 15 రూపాయలకువిక్రయిస్తున్నారు కరోనా టైంలో కేంద్ర ప్రభుత్వం దొడ్డిబియాడ్ని ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసింది పేద ప్రజలకు స్కూలు విద్యార్థులకు పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యాన్నిఏనాడైనా ప్రజా ప్రతినిధులు అధికారులు పిల్లలు గాని తింటున్నారా అని ఆలోచించాలి ప్రభుత్వాలు మారుతున్న పేద ప్రజలు చౌక దుకాణాల ద్వారా సన్నబియానికి నోచుకోవడం లేదు ఎన్నికల సమయంలో తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ చౌక దుకాణాల ద్వారా పేదలకు సన్నబియ్యం ఇస్తావని ప్రకటించింది కానీ బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాలేదు దొడ్డిబియ్యం పేద ప్రజలు తినకపోవడంతో బహిరంగ మార్కెట్లోకి పాలిష్ పట్టి సన్న బియ్యం లో కల్తీ చేస్తున్నారు కాకినాడ పోర్ట్ లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భారీ స్థాయిలో దొడ్డు బియ్యాన్ని పట్టుకున్నారు అంతేగాక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేని నాని పై దొడ్డిబియ్యం కేసులో ప్రభుత్వం విచారణ జరుగుతుంది చౌక దుకాణాల ద్వారా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తే ప్రతి పేదవాడు సన్నబియ్యం అన్నం తింటాడు దీంతో దొడ్డిబియ్యం బహిరంగ మార్కెట్ అన్న ప్రస్తావనే ఉండదు ఇప్పటికైనా పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయాలి.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎస్టీయు కృషి మరువలేనిది

విశాలాంధ్ర-రామసముద్రం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎస్టియు ఎంతగానో కృషి చేస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి మండల అధ్యక్షుడు అయూబ్ ఖాన్ తెలిపారు. గురువారం రామసముద్రంలోని మోడల్ స్కూల్ పాఠశాల ఆవరణంలో ఎస్టియు క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక సేవ కార్యక్రమాలను ఎస్టియు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో పాఠశాలల అభివృద్ధితో పాటు పేద విద్యార్థుల చేయూతకు సహకారం ఇస్తామని చెప్పారు. మండ లంలో అన్ని పాఠశాలల పదోతరగతి విద్యార్థులకు ఎస్టీయుచే ముద్రించబడిన స్టడీ మెటీరియల్ ను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు హేమలత , ఆంజనేయులు, ఎస్టియు ప్రధాన కార్యదర్శి రమాదేవి ఆర్థిక కార్యదర్శి సురేష్, అన్నమయ్య జిల్లా నాయకులు శంకర్, మనోహర, అనిల్ కుమార్, మహీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ మండలి బోర్డు పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-కొండాపురం: రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ మండలి పునరుద్ధరణ చేస్తామని ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా ఈనెల 6వ తేదిన ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టబోయే నిరాహారదీక్ష జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు పి.వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై నిర్మాణ కార్మికులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని పేర్కొన్నారు. కావున భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డు పునరుద్ధరించాలని కోరుతూ చేసే నిరాహార దీక్ష జయప్రదం చేయాలని కోరారు.

ప్రపంచ నాస్తిక మహాసభలకు పల్లవోలు రమణకు ఆహ్వానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఈనెల 4, 5 తేదీల్లో విజయవా డలో జరిగే ప్రపంచ నాస్తిక సభలకు భారత నాస్తిక సమాజం నాయకులు పల్లవోలు రమణకు విజయవాడ నాస్తిక కేంద్రం డాక్టర్ సమరం ఆహ్వానం పంపినట్లు తెలిపారు. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో పెంపొందించాలనే అంశంపై డాక్టర్ బ్రహ్మారెడ్డి, గుజరాత్కు చెందిన ప్రొఫెసర్ హిప్పు సాక నాథన్లు ప్రసంగిస్తారని, మానవ హక్కులు, సెక్యులరిజం, నాస్తిక విలువలు అనే అంశంపై మహారాష్ట్రకు చెందిన డాక్టర్ శంశుద్దీన్, చండీగఢ్ నుంచి రంజిత్ సింగ్, డాక్టర్ బెనర్జీ, సెక్యులర్ సోషల్ వర్క్ అనే అంశంపై ఆర్ సూయాజ్, సత్యనారాయణ, సంస్కార్ సంస్థ నుంచి జి.సకల, నాస్తివాదం, ప్రజాస్వామ్యం అనే అంశంపై జివివి డియస్ ప్రసాద్, హన్మంతరావు ప్రసంగిస్తారని తెలిపారు. రెండో రోజున యువతతో ప్రజాస్వామ్య విలువలు, శాస్త్రీయ దృక్పథం, యువత పాత్ర అనే అంశంపై మాజీ ఐఏఎస్ జయప్రకాష్ నారాయణ, డాక్టర్ వి.నారాయణ రావు, డాక్టర్ శ్రావన్కుమార్, శ్యాం సుందర్, రజిత గోరా, హసిల్ గోరా తదితరులు ప్రసంగిస్తారని వివరించారు. ఈ సభల్లో ఇతర దేశాల నుండి ప్రముఖ నాస్తికులు హాజరౌతున్నట్లు పేర్కొన్నారు.

కరపత్రాలు విడుదల చేసిన పి.సుబ్బరాయుడు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఏపీ ఆటోడ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా 4వ మహాసభలు జనవరి 21, 22న జరుగుతాయని అందుకు సంబంధించిన కరపత్రాలను ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, ఏపీ ఆటో వర్కర్స్ అండ్ డ్రైవర్స్ ఏఐటీయూసీ అనుబంధం జిల్లా అధ్యక్షులు వై.హరిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో అండ్ మోటార్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని, అలాగే వాహన మిత్ర రూ.15వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జీఓ నెంబర్ 21ని మేము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని హామీ ఇచ్చారని ఆ హామీని అమలు పరచాలని జిల్లా అధ్యక్షులు వై.హరి డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎం.శ్రీనివాసులు, సి.ఎల్లయ్య, నరసింహులు మాట్లాడుతూ దేశంలోనే వ్యవసాయ కార్మికులు తర్వాత అతిపెద్ద అసంఘటిత రంగం ఆటో కార్మికులు ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న ఆటో కార్మికులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు డ్రైవర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ 21, 22వ తేదిన జరిగే మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

చౌక దుకాణాలకు ధరఖాస్తు చేసుకోండి: తహసీల్దార్

విశాలాంధ్ర-కొండాపురం: మండలంలోని 36శాశ్వత చౌక దుకాణాలకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ గుర్రప్ప పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత చెంది, 18 నుండి 40సంవత్సరాల వయసులోపు, గ్రామాల వారీగా కేటాయించిన రిజర్వేషన్ల వారీగా ఈ నెల 8వ తేదిలోపు ధరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

వాలంటీర్లను కూటమి ప్రభుత్వం కొనసాగించాలి

ఆంధ్రప్రదేశ్ వాలంటీర్స్ అసోసియేషన్

విశాలాంధ్ర - జమ్మలమడుగు : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాలంటీర్లను కూటమి ప్రభుత్వం కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ వాలంటీర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. గురువారం జమ్మలమడుగులో వాలంటీర్లు సచివాలయ 20వ వార్డు సచివాలయ అడ్మిన్ రమణ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వాలంటీర్లకు పదివేల రూపాయలు గౌరవేతనం ఇస్తామని , వారిని కొనసాగిస్తామని చెప్పారని గుర్తు చేశారు. వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, చాలామంది వాలంటీర్స్ డిగ్రీలు, బీఈడీ లు చదివి ఉన్నారని, వాలంటీర్స్ గత ప్రభుత్వంలో ఇచ్చిన 5000 రూపాయలతోనే కుటుంబ పోషణ జరిగేదని అన్నారు. ఇప్పుడు కుటుంబ పోషణ కూడా ఇబ్బందికరంగా మారిందని, పెండింగ్ లో ఉన్న ఆరు నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు చిన్న, లక్ష్మీనారాయణ, సుభాన్, మౌనిక, రమాదేవి,హుస్సేన్ భాష, రాజన్న, దీప్తి, అబ్దుల్ రెహమాన్, రిజ్వాన్ గౌసియా, సుశీల, ఏఐవైఎఫ్ మండల కన్వీనర్ రాంప్రసాద్, చంద్ర తదితర వాలంటీర్లు పాల్గొన్నారు.

రేషన్ షాపులకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర -బ్రహ్మంగారి మఠం : మండల పరిధిలోని 45 రేషన్ షాపులు ఉండడంతో అదనంగా 15 రేషన్ షాపులు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని అందులో భాగంగానే రేషన్ షాపులకు ఆహ్వాన దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని బ్రహ్మంగారిమఠం తాహశీల్దార్ దామోదర్ రెడ్డి కి నూతనంగా ప్రభుత్వం అనుమతి ఇచ్చిన రేషన్ షాపులకు క్యాస్ట్ వారిగాఆహ్వాన దరఖాస్తులను అందజేస్తున్నారు అందులో భాగంగానే తాహశీల్దార్ స్వీకరిస్తున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోనే నూతనంగా 15 రేషన్ షాపులను క్యాస్ట్ వారీగా కేటాయించిన వారి కి స్థానాలలో దరఖాస్తులను ఇవ్వాల్సిందిగా నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని ప్రభుత్వం ఇచ్చిన నిబంధన పకారమే క్యాస్ట్ డీలర్లు ఇంటర్ పాస్ అయ్యి ఉండాలని గతంలో 45 రేషన్ షాపులు ఉండేటివి అని అదనంగా 15 రేషన్ షాపులు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని సోమిరెడ్డి పల్లె వీరనారాయణపురం కొత్తూరు బీసీఏ రిజర్వేషన్ కల్పించిందని సోమిరెడ్డిపల్లి టు మహిళా, మరకంటౌన్ ఎస్సీ రిజర్వేషన్, చెంచయ్య గారి పల్లె వినికిడి లోపం వారికి రిజర్వేషన్, రామచంద్రపురం టి చౌదరవారిపల్లె, వినికిడి లోపం ఉన్నవారికి కేటాయింపు రేకలకుంట (బీసీఏ) దిరసవంచ్ ఇతరులు, గొడ్లవీడు మహిళ భాకరాపేట ఓసి, ముడమాల బీసీ డి, నర్సిరెడ్డి పల్లె ఎస్సీ మహిళ ఆహ్వాన దరఖాస్తులను ఈ నెల 6 నుండి స్వీకరించడం జరుగుతుందని వాటిని పరిశీలన చేసి ఆర్డీవోకు అందజేయడం జరుగుతుందని ఆ తర్వాత వారికి రాత పరీక్షలు ఇంటర్వ్యూలు, వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు క్యాస్ట్ ఇన్కమ్ చదివిన సర్టిఫికెట్లు తప్పనిసరి ఇంటర్వ్యూలో చూపించాలని వారు తెలిపారు.

దళితులకు ఇచ్చిన భూములు దళితులకు ఇవ్వాలి: సీపీఐ

విశాలాంధ్ర - బ్రహ్మంగారి మఠం : మండలంలో ఉన్నటువంటి దళితులు యొక్క బ్రతుకులు ఇప్పటికైనా మారుతాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా ఉంది, టి. చౌదరివారి పల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో, భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి హృదయ్ నాథ్,, మాట్లాడుతూ,, టీ. చౌదరివారిపల్లె దళితులకు 2008వ సంవత్సరమున 402సర్వేనెంబర్ లో దాదాపు 34 మందికి , డీ,పట్టాలు మంజూరు చేసినప్పటికీ ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రభుత్వాలు,, నాయకులు,, అధికారులు,, మారుతున్న కూడా దళితులకు కేటాయించినటువంటి భూములను చూపించకపోవడంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. మండల వ్యాప్తంగా భూకబ్జాదారులు వందల ఎకరాలను కబ్జా చేస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప వారికి అడ్డుకట్ట వేయడంలో విఫల అయ్యారు. ఇప్పటికైనా మండల వ్యాప్తంగా ఉన్నటువంటి అణగారిన వర్గాలకు అసైన్మెంట్ ద్వారా కేటాయించినటువంటి భూములను చూపించకపోతే తొందర లోనే భూ పోరాటం తప్పదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాయకులు లక్కినేని ప్రభాకర్, రవి, వినయ్ వారితో పాటు గ్రామస్తులు మహిళలు బ్రహ్మంగారిమఠం తాహశీల్దార్ దామోదర్ రెడ్డికి విన్నతి పత్రాన్ని అందజేశారు. గ్రామసభల ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించి 45 రోజుల్లో పరిష్కారం చేసి భూ సమస్యలకు శ్రీకారం చూస్తామని జిల్లా కలెక్టర్ ఆర్డీవో కూడా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని మండలంలో భూములు సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు అందుకే రెవెన్యూ గ్రామసభలు పెడుతున్నామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర-కడప : జిజిహెచ్ రిమ్స్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. జిజిహెచ్ రిమ్స్ నర్సింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జివి రమాదేవి,జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ రంగస్వామి, సి ఎస్ ఆర్ ఎం ఓ డాక్టర్ వై. శ్రీనివాసులు, డిప్యూటీ డైరెక్టర్ ఎల్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.కేక్ కట్ చేయించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ ఎం ఓ డాక్టర్ రాజేశ్వరి, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ మాదురీలత,నర్సింగ్ సిబ్బంది,పరిపాలన విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

గోపగుడిపల్లెలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

విశాలాంధ్ర-రామాపురం : మండలములోని గోపగుడి పల్లె గ్రామ పంచాయతీలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిని వై నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లకిడిపల్లి లక్కిరెడ్డిపల్లి డివిజన్ సహాయక వ్యవసాయ సంచాలకులు ఎం జయ రాణి హాజరై మాట్లాడుతూ పొలం పిలుస్తోందిలో భాగంగా రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు ,రబీలో మినుము. వేరుశనగ పంటలో సమగ్ర సస్య రక్షణ పద్ధతులు గురించి రైతులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా రైతులు రబీ సీజన్ లో సాగు చేసిన పంటలకు పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగమణి పేర్కొన్నారు.కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జోన్-4 పరిధిలో 150 స్టాఫ్ నర్సు ఉద్యోగాలు

రీజనల్ డైరెక్టర్ డాక్టర్.రామ గిడ్డయ్య.

విశాలాంధ్ర-కడప :ప్రాంతీయ సంచాలకులు, వైద్య మరియు ఆరోగ్య శాఖ, కడప, జోన్-4 తేదీ: 02.01.2025 నియామకపు ప్రకటన నెంబర్ 01/2025 ప్రాంతీయ సంచాలకులు, వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయము, కడప జోన్-4 వారి పరిధిలోని 150 స్టాఫ్ నర్స్ ఉద్యోగములను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయుటకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది. ఈ ఉద్యోగములకు సంబంధించిన దరఖాస్తు నమూనా మరియు ఇతర వివరములు వెబ్ సైట్ నందు ఉంచడమైనది. అభ్యర్థులు దరఖాస్తును వెబ్ సైట్ నుండి డౌన్లోడ్ చేసుకొని భర్తీ చేసిన దరఖాస్తు తో పాటు నిర్దేశించిన దరఖాస్తు రుసుము మరియు సంబంధించిన సర్టిఫికెట్లను జతపరిచి 03-01-2025 వ తేదీ నుండి 17-01-2025 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపల దరఖాస్తులను ప్రాంతీయ సంచాలకులు, వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయము, కడప నందు అందచేయవలసినదిగా డాక్టర్ బి. రామగిడ్డయ్య, ప్రాంతీయ సంచాలకులు, వైద్య మరియు ఆరోగ్య శాఖ, కడప జోన్-150. వారు కోరడమైనది. నిర్దేశించిన గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగణలోనికి తీసుకోమన్నారు.

పదవ తరగతి స్టడీ మెటీరియల్స్ పంపిణీ

విశాలాంధ్ర రామసముద్రం : రామసముద్రం తూర్పు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నమయ్య జిల్లా సహా అధ్యక్షురాలు హేమలత రామసముద్రం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి పేద విద్యార్థులకు యూటీఎఫ్ తయారుచేసిన స్టడీ మెటీరియల్ 25000 రూపాయలు విలువ కలిగిన పుస్తకాలను ఎంఈఓ ల చేతుల మీదుగా అందజేశారు ఈ మెటీరియల్ ద్వారా చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరమని తెలిపారుఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యురాలు హేమలత మాట్లాడుతూ గడచిన 20 సంవత్సరాల నుండి తాను పనిచేసిన మండలంలోని అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందించినట్లు చెప్పారు కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు: ఆర్డీవో

విశాలాంధ్ర-రామాపురం: గ్రామాలలో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు చేపట్టిందని ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బండపల్లి కుమ్మర పల్లి లో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇలాంటి భూ సమస్యలు ఉన్న పరిష్కరించుకోవడానికి ప్రజలు రెవిన్యూ సదస్సును వినియోగించుకొని పరిష్కరించుకోవాలన్నారు. భూమి కొలతలు తక్కువఉన్న ఆన్లైన్ సమస్యలు ఉన్న రిసర్వే లో భూమి తక్కువ చూపించిన వన్ బి అడంగల్ ఇతర సమస్యలున్న ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. అనంతరం గ్రామ ప్రజలు తమ భూ సమస్యలపరిష్కారం కోసం అర్జులు అందజేశారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి.మని. టిడిపి నాయకులు కార్యకర్తలు రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీలే అభివృద్ధికి మూలం

విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తాం:ఎంఈవో

విశాలాంధ్ర-చెన్నూరు : ప్రభుత్వ పాఠశాలకు విద్యా కమిటీలే అభివృద్ధికి మూలం అని, విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కమిటీ మెంబర్లు కృషి చేయాలని పాఠశాలలో అభివృద్ధి చెందాలంటే స్థానికంగా ఉన్న కమిటీ వారిదే కీలక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు పాఠశాలపై తుల తండ్రులకు సమస్యలు పై అవగాహన ఉంటుందని అభివృద్ధి చేసేందుకు ఏమి కావాలనో, అధికారుల దృష్టికి తీసుకువస్తే ఆ పాఠశాల అభివృద్ధికి ఉపయోగపడిన వారు అవుతారన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చే విధంగా చేయాలని కావున విద్యార్థుల సంఖ్యను కూడా పెంచి అభివృద్ధికి నిలవాలని కోరారు ఈ సమావేశంలో ఎంఈఓటు సునీత హెచ్ఎంలు ప్రధానోపాధ్యాయులు మరి ఉమామహేశ్వరి ట్రైనింగ్ ఇచ్చేవారు ఖాదర్ బాషా, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, విద్యా కమిటీ చైర్మన్లు వైస్ చైర్మన్లు కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు మౌలిక సదుపాయాలు కాపాడుకుందాం

విశాలాంధ్ర-రామాపురం: పాఠశాలల అభివృద్ధి మౌలిక సదుపాయాలు పర్యావరణాన్ని కాపాడుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు రామకృష్ణుడు.జయ చంద్ర లు తెలిపారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో జరుగుతున్నటువంటి ప్రాథమిక. ప్రాథమికోన్నత. ఉన్నత పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు ఉపాధ్యాయినీలకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిట్స్ ఇంజనీరింగ్ ఫార్మసీ విద్యాసంస్థల చైర్మన్ ఎం భాస్కర్ పాల్గొన్నారు. ఆయన 2025 క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి పిల్లలకు అందిస్తున్నటువంటి సౌకర్యాలు. విద్య గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్యామలదేవి ఉపాధ్యాయులు. పాల్గొన్నారు.

మండల స్థాయి యజమాన్యం కమిటీ శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర-రామాపురం: మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్ నందు గురువారం మండల స్థాయి పాఠశాల యజమాన్య కమిటీ సభ్యులకు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారులు రామకృష్ణుడు జయ చంద్ర తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ బి విశ్వనాథ్. కే. కుమార్ జి సి వెంకటసుబ్బయ్య. మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సిఆర్ఎంటి పి. గోవర్ధన్ కె.విశ్వనాథ్ బి.భానుమతి వై. అంజనమ్మ. తల్లిదండ్రుల కమిటీ సభ్యులు. తదితరులు పాల్గొన్నారు.

అభిమానాన్ని గుండెల్లో దాచుకుంటాం

ఎంపి, మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర- రైల్వేకోడూరు: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త అభిమానాన్ని గుండెల్లో దాచుకుం టామని రాజంపేట పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రిత్వశాఖ సంప్రదింపుల కమిటీ(హెంశాఖ) సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు,వైస్ ఎంపిపి ఫ్లోర్ లీడర్ రామిరెడ్డి ధ్వజారెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముద్దలూరు సుబ్బరామరాజు, విపిఆర్ కండ్రిక సహకార సొసైటి ఛైర్మన్,రైతు డిపో అధినేత కొండూరు సుదర్శన్ రాజు,అడ్డూరు విజయ్ కుమార్ రాజు తదితరులు ఎంపి, ఎమ్మెల్యే ల నివాసాలకు వ్యయ ప్రయాసాలకోర్చి వెళ్లి శాలువా కప్పి పూలమాలవేసి 2025 నూతన సంవత్సర హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపి అభిమానాన్ని చాటుకున్నారు. ఇంతటి అభిమానాన్ని చూపిన నాయకులను, కార్యకర్తలను మరిచిపోలేమని ఎంపి, మాజీ ఎమ్మెల్యే, వైస్ ఎంపిపి కొనియాడారు. నాయకుల నివాసాల వద్ద నూతన సంవత్సర సందడి వాతావరణం నెలకొంది.

నిచ్చల్ రెడ్డికి స్వాగతం పలికిన టిడిపి యూత్

విశాలాంధ్ర-రామాపురం: మండలంలోని కసిరెడ్డి గారి పల్లి పంచాయతీ. కొత్త రోడ్డు నారాయణపురం కు చెందిన ఏనుగుల సుధాకర్ స్వగృహంలో గురువారం రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తనయుడు నిచ్చల్ నాగిరెడ్డికి తెలుగుదేశం పార్టీ యూత్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను యూత్ అందరూ కలిసి శాలువాతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం యూత్ ఏర్పాటుచేసిన ఇందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుధాకర్ ఈశ్వరయ్య తిమ్మారెడ్డి. లోకేష్. రాజేష్. నారాయణ. ధనుంజయ. నాగరాజు ఆర్ఎంపి డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారులకు పీఎం విశ్వకర్మ యోజన ఎంతో ఉపయుక్తం :మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ శివలింగయ్య

విశాలాంధ్ర-మదనపల్లె : చేతివృత్తి దారులకు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ఎంతో ఉపయుక్త మని,ఈ పథకాన్ని చక్కగా సద్విని యోగం చేసుకోవాలని మదనపల్లి మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ శివ లింగయ్య,డాక్టర్ స్వాతి చక్రపాణి లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక మదనపల్లి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా వున్న శిక్షణ కేంద్రంలో 7 రోజుల పాటు తాపీ మేస్త్రి శిక్షణ పూర్తి చేసుకొన్న వారికి గురువారం సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శివలింగయ్య మాట్లాడుతూ తాపీమేస్త్రిగా శిక్షణ పూర్తి చేసుకున్న వారు తమ నైపుణ్యాన్ని మరింతగా పెంచుకొని చక్కగా రాణించాలని సూచించారు. పోటీ ప్రపంచంలో ప్రతిభ ఉంటేనే ప్రతిఫలం దక్కుతుందని ఇలాంటి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకున్నప్పుడే మెరుగైన ప్రతిభ తో రాణించే అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ స్వాతి చక్రపాణి మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్ ద్వారా రూ.లక్ష వరకు ఎటువంటి పూచీకత్తు లేకుండా బ్యాంకు ఋణం పొందే అవకాశం, శిక్షణ కాలంలో రోజుకు రూ.500 స్టైఫండ్, రూ.15 వేలు విలువ చేసే టూల్ కిట్ ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ యోజన ట్రైనింగ్ పార్టనర్ చక్రపాణి, మధుసూదన్, 71మంది తాపీ మేస్త్రి ట్రైనర్స్, కోఆర్డినేటర్ శంకరయ్య, సిబ్బంది ప్రసన్న, వినీత లు పాల్గొన్నారు.

హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి దాతలు ముందుకు రావడం హర్షణీయం :ఎమ్మెల్యే షాజహాన్ బాషా

విశాలాంధ్ర-మదనపల్లె:హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి దాతలు ముందుకు రావడం హర్షణీయమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. హిందూస్మశాన వాటికను అభివృద్ధి చేసేం దుకు మాజీ సైనిక ఉద్యోగి కంచర్ల శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో నిమ్మనపల్లి రోడ్డు రామాచార్లపల్లి వద్ద ఉన్న హిందూ స్మశాన వాటికలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా హాజరయ్యారు.70 ఏళ్ల క్రితమే హిందూ స్మశాన వాటిక కోసం ప్రభుత్వం కేటాయించిన 6.32 ఎకరాల భూమిలో కంప చెట్లు ఏపుగా పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్న నేప థ్యంలో స్మశాన వాటికను అభివృద్ధి చేసే దిశగా కంచర్ల శ్రీనివా సులు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు.. పెద్ద ఎత్తున మదనపల్లి పట్టణ ప్రముఖులు, రాజకీయ పార్టీ నేతలు తరలి వచ్చారు. హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కోసం ఎమ్మెల్యే షాజ హాన్ బాషా రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఎమ్మెల్యే స్ఫూర్తితో పెద్ద ఎత్తున దాతలు ముందుకు వచ్చి రూ.5 లక్షల వరకు విరా ళాలు ప్రకటిం చారు. బసినికొండ గ్రామానికి చెందిన మేస్త్రి గుట్ట రమణ రూ.25 వేలు, రామాచార్లపల్లికి చెందిన విక్రమ్ రూ.25 వేలు, కౌన్సిలర్ నాగార్జున బాబు రూ. 50వేలు, జనసేన సీనియర్ నాయకులు శ్రీరామ రామాంజనేయులు రూ.50వేలు, వాల్మీకి సంఘం నాయకులు పులి శ్రీనివాసులు రూ.10వేలు, రజక సంఘం నాయకులు నాగయ్య రూ.10 వేలు, నాదేళ్ల శివన్న రూ. 10 వేలు, లారీ సుధ రూ.10 వేలు, ఎరుకుల సంఘం నాయకులు రమణ రూ.5 వేలు, షంషీర్ రూ. 15 వేలు, రఘుపతి నాయుడు రూ.25 వేలు చొప్పున విరాళాలు ప్రకటించారు. దాతలు ఇచ్చిన విరాళాలే కాకుండా ఎమ్మెల్యే మరిన్ని నిధులు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్మశానవాటికలో షెడ్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే షాజహాన్ భాష చేతులు మీదుగా శంకు స్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఆర్.జె.వెంకటేష్, నవీన్ చౌదరి, కత్తి లక్ష్మన్న, వెంకటరమణ, వై.యస్ మునిరత్నం, సంగం హరి, చిన్న మహేష్, జెసిబి వేణు, విజయమ్మ, ఉషారాణి, బసినికొండ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జనసేన నాయకులు ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ

విశాలాంధ్ర-మదనపల్లె: జనసేన పార్టీ నాయకులు రామాంజనేయులు బర్మా రోడ్డు సాయిబాబా ఆలయం వద్ద 2025 మొక్కలను ఉచితంగా అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాల్గొన్నారు. సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మొక్కలను పంపిణీ చేసే వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవా కార్యక్రమాలతో మదనపల్లి నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపును తీసుకున్న జనసేన పార్టీ సీనియర్ నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో వారం రోజుల క్రితం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించి 100 యూనిట్లు రక్తాన్ని దాతల ద్వారా అందించారని, నియోజకవర్గ పరిధిలో 25 వేల మొక్కలు నాటేందుకు కార్యక్రమాన్ని ప్రారం భించిన రామాంజనేయులు స్ఫూర్తితో యువత ముందుకు వచ్చి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి మదనపల్లి ప్రశాం తతను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగార్జున బాబు, మాజీ కౌన్సిలర్ బాబు నాయుడు, జీవి నాయుడు, విజయమ్మ, యువ నాయకులు హరిహరన్, జనసేన నాయకులు జగదీష్, శ్రీరామ వినోద్, నవీన్ చౌదరి, కమలామరి కృష్ణ, జెసిబి వేణు, షంషీర్, రఘుపతి నాయుడు, మల్లికార్జున్ నాయుడు, చిన్న మహేష్, నాగయ్య, పెద్ద సంఖ్యలో జనసేన, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : సి ఐ.యుగంధర్

విశాలాంధ్ర-పీలేరు: పర్యావరణ పరిరక్షణ లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పీలేరు అర్బన్ సిఐ యుగంధర్ తెలిపారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీలేరు (మెయిన్) నందు గ్రీన్ సింగర్స్ క్లబ్ లో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీలేరు సిఐ యుగంధ వచ్చి స్థానిక క్రాస్ రోడ్ నందు మొక్కలు నాటి నీళ్ళు పోశారు ఈ సందర్భంగా సిఐ యుగంధర్, హెచ్ఎం సురేంద్రనాథ్ రెడ్డి లు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములై మొక్కలు నాటాలని మొక్కలు మానవాళి ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని వాటి ఆవశ్యకత గురించి విద్యార్థులకు తెలియజేశారు ఈ సందర్భంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు అనంతరం పీలేరు పట్టణంలో క్రాస్ రోడ్డు, మసీదు, శివాలయం లలో మొక్కలు నాటారు ఈ కార్యక్రమంలో జి ఎఫ్ సి స్థాపకులు శ్రీరాములు, ఎన్ సి సి ఆఫీసర్ జైపాల్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పోతంశెట్టి రమేష్, నరసింహులు, భాస్కర, మహిళ ఉపాధ్యాయునిలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యా కమిటీతోనే పాఠశాలలు అభివృద్ధి

విశాలాంధ్ర- పీలేరు:పాఠశాల విద్యా కమిటీతోనే పాఠశాలలు అభి వృద్ధి.సాధ్యమని మండల విద్యాశాఖ అధికారులు వై. లోకేష్ రెడ్డి, పద్మావతమ్మలు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పాఠ శాల యాజమాన్యం కమిటీ శిక్షణా తరగతులు పీలేరు మండలంలో మండల విద్యాశాఖ అధికారులు వై. లోకేష్ రెడ్డి , పద్మావతమ్మ, అధ్యక్షతన జరిగింది. ఈ శిక్షణలో భాగంగా ఎస్.ఎంసి.(స్కూల్ మేనే జ్మెంట్ కమిటీ) నూతనంగా ఏర్పడిన కమిటీ చైర్మన్‌లకు, పాఠశాల హెడ్మాస్టర్ లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో పాఠశాల ఎన్నిక యాజమాన్య కమిటీ విధులు బాధ్య తలు గురించి విద్య హక్కు చట్టం అమలు గురించి తర్వాత సమ కాలీన అంశాలు పాఠశాలలోని సమకాలిన అంశాలు వాటి పరిష్కా రాలు సామాజిక తనిఖీ గురించి పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తెలియజేశారు. ప్రజల భాగ స్వామ్యంతో పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని తదితర అంశాలను ఈ శిక్షణలో నేర్చుకోవడము తిరిగి సంబంధిత పాఠశాలలలో కమిటీ మెంబర్లకి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.ఈ కార్యక్రమములో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీ.జీ.నటరాజన్,ఆర్పీలుగా ఉపాధ్యాయులు ఓబుల్ రెడ్డి,సురేష్ కుమార్,అల్తాఫ్,నజీర్, ప్రభుత్వం ఉన్నత పాఠశాల కమీటీ ఛేర్మేన్ శ్రీరాములు,లావణ్య, సీ.ఆర్పీలు మురళీధర్ రాజు, నాగరాజ,అశోక్,మాధవి, మండలంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాలల కమిటీఛేర్మేన్లు,కమీటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ యోగాసన పోటీలలో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి ప్రతిభ

విశాలాంధ్ర-సంబేపల్లె: జాతీయ యోగాసన పోటీలలో ప్రతిభ కనపరిచిన ఉపాధ్యా యురాలు విజయలక్ష్మిని గురు వారం మండల కేంద్రంలోని సంబేపల్లి హైస్కూల్ నందు కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. జార్ఖండ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో డిసెంబర్ 26 నుండి 31 వరకు 6 రోజులపాటు 43వ జాతీయ యోగాసన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అన్ని రాష్ట్రాల నుండి యోగ గురువులు పాల్గొన్న ఈ పోటీలలో ఉపాధ్యాయిని విజయలక్ష్మి పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ప్రస్తుతం సంబేపల్లె మండలం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఈమె సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ఈ కార్యక్ర మంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, ప్రధానోపా ధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, చంద్రశేఖర్, సుభాషిణి, జగదీశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయానికి ఐటీసీ వెన్నుదన్ను

కేవీపల్లె మండలం నూతనకాలువకు చెందిన రైతు శివ పంట పరిశీలన

విశాలాంధ్ర- పీలేరు :పీలేరు ప్రాంతంలో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న రైతులకు శుభవార్త. సేంద్రీయ పద్ధతుల్లో మామిడి, బొప్పాయి, అరటి సాగు చేసే రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ఐటీసీ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు వారు పీలేరు నియోజకవర్గంలో ప్రకృతి,సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న రైతుల గురించి వివరాలు సేకరిస్తున్నారు. అందులో భాగంగా కేవీపల్లె మండలం నూతనకాల్వకుచెందిన శివ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో మామిడి పండిస్తున్నట్లు పీలేరుకు చెందిన ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణుడుబోదేషావలి ద్వారా తెలుసుకున్న ఐటీసీ సంస్థ దక్షిణ భారత ఎఫ్పీవోల అభివృద్ధి మేనేజర్ పురుషోత్తం, 'బ్రెడ్స్' ఎన్జీవో సీనియర్ మేనేజర్ బోజిరాజుతో కలిసి గురువారం శివ వ్యవసాయక్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సంద ర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ సేంద్రీయ ఉత్పత్తులకు మార్కె ట్లో బాగా డిమాండ్ ఉన్నప్పటికీ తగితంగా లభ్యత లేకపోవడంతో చాలా మంది రసాయనిక ఉత్పతులనే వాడుతున్నారన్నారు. వారందరికీ సేంద్రీయ ఉత్పత్తులను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో తమ సంస్థ సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోం దన్నారు. అందులో భాగంగా మామిడి, బొప్పాయి, అరటి పంటల్లో ఇప్పటికే సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్న రైతులను గుర్తించి వారి పంటలను కొనేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అంతే కాకుండా ఆ మూడు పంటలు సాగు చేసే ఆసక్తి ఉన్న రైతులకు తమ సంస్థ ద్వారా సాంకేతిక శిక్షణ ఇవ్వడంతోపాటు కొంత మేర ఇన్పుట్‌సబ్సిడీ కూడా అందజేస్తామన్నారు. మామిడిలో రెండు, మూడేళ్ల చెట్లు ఉన్న వారు పూర్తిగా సేంద్రీయ పద్ధతిలోకి మారేందుకు అనువైన వాతావరణం కల్పిస్తామన్నారు. తమ పర్యవేక్షణలో పండించిన పంటలను తామే కొనుగోలు చేస్తామని, అలా తమకు అమ్మడానికి ఇష్టపడని రైతులు వారికి కావాల్సిన చోట అమ్ముకోవచ్చునన్నారు. పీలేరు నియోజకవర్గంలో ఇటువంటి రైతులను గుర్తించే బాధ్య తను బోదేషావలికి చెందిన ఎన్జీవో 'ఆర్వ్యాట్ సంస్థకు అప్పగిం చినట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు బోదేషావలిని 97036 35827 నెంబరులో సంప్రదించాలన్నారు. త్వరలో ప్రారంభం కానున్న మామిడి సీజన్ నుంచే పీలేరులో తమ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్లు పురుషోత్తం తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలి

విశాలాంధ్ర -వల్లూరు : పాఠశాల కమిటీ చైర్మన్లు పాఠశాలలను బలోపేతం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి పుత్త విజయ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ విధులు, బాధ్యతలు అనే విషయం గురించి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండల పరిధిలోని పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు పాఠశాల కమిటీ చైర్మన్లు కమిటీ సభ్యులు ఏర్పాటు చేయడమైనది.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి విజయ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో భాగంగా కమిటీ బలోపేతం చేసుకొని తమ పరిధిలోని పాఠశాలలు బలోపేతం ఈ కార్యక్రమంలో పీఎం శ్రీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సురేష్ బాబు ఉపాధ్యాయులు సి.వి సురేంద్ర, ఎస్.శివరామరాజు, శివశంకర్, ఎంఆర్సి సిబ్బంది ఓబయ్య, రాజా, విశ్వనాథ్, శైలజ పాల్గొన్నారు.

గుడిసె వాసులకు ఇంటి పట్టాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఐ డిమాండ్

విశాలాంధ్ర -బద్వేలు : భారత కమ్యూనిస్టు పార్టీ గోపవరం మండల సమితి ఆధ్వర్యంలో సిపిఐ ఏరియా కార్యవర్గ సభ్యులు పివి రమణ అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యులు వి వీరశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వీర శేఖర్ మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలోని గోపవరం మండలం పిపి కుంట వద్ద బేతాయ పల్లె పంచాయితీ గ్రామ పొలం సర్వే నెంబర్ 1557, 1561 లలో గత ప్రభుత్వ హయాంలో గోపవరం మండలం పేద ప్రజలతో గత సంవత్సరం ఫిబ్రవరి మాసంలో సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటం నిర్వహించారు.అయితే ఆ పేద ప్రజలు ఆరోజు నుండి వరకు అక్కడే గుడిసెలు వేసుకుని స్థిర నివాసం ఉంటున్నారు. ఎండనకా వాననక గాలినక చలిఅనక తేలు పాములు లెక్కచేయకుండా నీళ్లు లేకపోయినా కరెంటు లేకపోయినా అక్కడే స్థిర నివాసం ఉంటున్న పేద ప్రజలకు ఇంటి పట్టాలు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో జగనన్న పేరుతో అక్కడ జగనన్న కాలనీ ఏర్పాటు చేయడం జరిగింది జగనన్న కాలనీ పేరుతో గత ప్రభుత్వం లో ఉన్నటువంటి నాయకులు నిజమైనటువంటి లబ్ధిదారుల లిస్టు కాకుండా వారికి అనుకూలమైన లిస్టును తయారుచేసి ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలి అనే కోణంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూమిని కబ్జా కాకుండా ఆపి పేద ప్రజలతో గుడిసెలు వేయడం జరిగింది. ఇప్పటికైనా అక్కడ నివాసం ఉంటున్న పేద ప్రజలను అర్హులుగా ఉన్న టువంటి వారిని గుర్తించి వారికి సరైనటువంటి న్యాయం చేయాలని గోపవరం మండల తాసిల్దారిని కోరారు. అనంతరం గోపవరం మండల తాసిల్దార్ వినతిపత్రం సమర్పించి పేద ప్రజల ఉద్దేశించి మాట్లాడ వలసిందిగా అని కోరారు. తాసిల్దార్ మాట్లాడుతూ మీ సమస్యలను పై అధికా రుల దృష్టికి తీసుకెళ్తామని అర్హుల జాబితా గుర్తిస్తామని పై అధికారుల ఆదేశాల మేరకు మీకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గోపవరం మండల కార్యదర్శి గూడూరు పెంచలయ్య వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఖాదర్ బాషా వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి పొంగూరు నాగరాజు శాఖ కార్యదర్శి సిద్ధ వెంకటయ్య సహాయ కార్యదర్శి నాగిపోగు ఓబులేసు లక్ష్మమ్మ ఓబులమ్మ గురవయ్య ఓబులేసు కిరణ్ రాజేష్ పెంచలయ్య ప్రభాకర్ నరసింహ లక్ష్మయ్య పెంచలయ్య కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర -పులివెందుల: పులివెందుల పట్టణంలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నూతన భవన నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. దశాబ్దాలుగా సామాజిక సేవలందిస్తున్న సేవా సమితికి ఒక కొత్త భవనం అంటూ ఉండాలన్న ఆలోచనతో ముందుకు వెళుతోంది. ఈ క్రమంలో ఉచిత ఉపాధ్యాయ బృందం, దాతలు, వివిధ రాజకీయపార్టీల నాయకులు, పాత్రికేయులు సహకరించడంతో భవన నిర్మాణానికి మార్గం సుగమమైంది. నీటి వసతి కోసం గురువారం బోరువేశారు. సుమారు 240 అడుగుల లోతు వెళ్లే సరికి గంగ కన్పించింది. సరిపడు నీరు లభించినట్లు సేవా సమితి అధ్యక్షుడు రాజు ఈ సందర్భంగా వెల్లడించారు. భవన నిర్మాణంలో భాగస్వాములయ్యేందుకు దాతలు ముందుకు రావాలని రాజు విజ్ఞప్తిచేశారు. భవన నిర్మాణం కోసం సాయపడే దాతలు 9966509364 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు నాగేంద్ర, పద్మనాభయ్య, మహ్మద్, రఫీ, రాజా, బండారు రాజా, నేత్ర సేకరణ కేంద్రం టెక్నిషియన్ హరీష్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడిన ఏఎన్ఎంపై సస్పెన్షన్ వేటు

విశాలాంధ్ర -రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 31న జిల్లాలో ఎన్టీఆర్ సామాజిక భరోసా పెన్షన్లు పంపిణీ చేయడం జరిగింది.ఇందులో భాగంగా రాయచోటి మున్సిపల్ పరిధిలో పెన్షన్ల పంపిణీ సందర్భంగా అవినీతికి పాల్పడుతున్నట్లు కొంతమంది నుంచి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ఫిర్యాదులు అందాయి. ఈ విషయమై కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేయగా రాయచోటి మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు ఏఎన్ఎం 100 రూపాయలు చొప్పున పెన్షనర్ల నుంచి వసూలు చేసినట్లు తేలింది. అవినీతికి పాల్పడిన సదరు ఏఎన్ఎంను వెంటనే సస్పెండ్ చేయాల్సిందిగా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్, డిఎంహెచ్వోలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాయచోటి మున్సిపల్ కమిషనర్ నివేదిక ఆధారంగా సదరు ఏఎన్ఎంను డిఎంహెచ్ఓ సస్పెండ్ చేయడం జరిగింది. పేదలకు ఆర్థిక భరోసా అందించే ఇటువంటి కార్యక్రమాలలో ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

నిత్య పూజయా ఏజెన్సీని ప్రారంభించిన ఎమ్మెల్యే..

విశాలాంధ్ర - వల్లూరు : కడప తాడిపత్రి జాతీయ రహదారి గణేష్ పురం వద్ద శ్రీ నిత్య పూజయ స్వామి ఏజెన్సీని కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి గురువారం ప్రారంభించారు. శ్రీ నిత్య పూజయా స్వామి ఏజెన్సీ ప్రోప్రైటర్స్ పి. నాగ సుబ్బారెడ్డి, కె.నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో షాపు రిబ్బన్ కట్ చేశారు. అనంతరం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్త నర్సింహారెడ్డి, నియోజవర్గం టిడిపి యువ నాయకులు పుత్త లక్ష్మిరెడ్డి టెంకాయ కొట్టి ప్రారంభించారు. నిత్యపూజయ్య స్వామి ఏజెన్సీ నందు సరసమైన ధరలకు ఐరన్ కడ్డీలు, రేకులు సీట్లు, ఐరన్ పైపులు, వాటర్ ట్యాంకీలు, పారలు, గోళాలు లభించును ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు లేబాక నాగేశ్వరెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన శ్రీ కేవలానంద ఆరాధన ఉత్సవాలు

విశాలాంధ్ర- రామాపురం: మండల కేంద్రమైన రామాపురంలో వెలసిన శ్రీ కేవలానంద లక్ష్మనార్య స్వామి ఆరాధన ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. అన్నమయ్య జిల్లా పరిధిలో శ్రీ కేవలనంద స్వామి ఓ ప్రఖ్యాత గురువు ఈ ఆరాధన ఉత్సవాలు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగాయి. 65వ ఆరాధన ఉత్సవాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. హిందూ ముస్లిం తేడా లేకుండా ఈ ఆరాధన ఉత్సవాలకు ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్రేయతర ప్రాంతాల నుంచి ఈ ఆరాధన ఉత్సవాలకు ప్రజలు పాల్గొనడం విశేషం. ఈ ఆరాధన ఉత్సవాలు జరుగుతున్న మూడు రోజులు ఉచిత అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రామరాజు ధర్మపత్ని లక్ష్మమ్మ కూడా పస్తులుండి పేదరిక అన్నదానం చేసేది ఈ విధంగా స్వాములవారు తమ అపర భక్తితో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పలు రకాల దీక్షలు యాగాలు చేసేవారు స్వామీజీ రామాపురం మండలం నల్లగుట్ట పల్లి గ్రామం బి రాచపల్లిలో ఏర్పరచుకొని ప్రజల కష్టసుఖాలను తెలుసుకొని ఆ కష్టసుఖాలు తీర్చే దిశగా వస్తూ వచ్చాడు అనంతరం స్వామివారు నీళ్లున్న బావుల్లో నీటిపై కూర్చోవడం చూసి అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేసేవారు. స్వామివారికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో ఏర్పడ్డారు ఆరాధన ఉత్సవాలు జరిగే సమయంలో ప్రతి ఒక్కరూ దగ్గరుండి ఆరాధన ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

వైసీపి నాయకులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర- రామాపురం : మండలం చిట్లూరు గ్రామంలో పలువురిని గురువారం వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు.చిట్లూరు గ్రామంలోని శనక్కాయవాండ్లపల్లె కు చెందిన వైఎస్ఆర్ సిపి నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి తల్లి చంద్రావతమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుచున్నారు.ఆమెను శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి ఆరోగ్యపరిస్థితులనడిగి తెలుసుకున్నారు.మజ్జిగవాండ్లపల్లెలో వైఎస్ఆర్ సీపీ కార్యకర్త ఈశ్వర్ రెడ్డి పెరాల్సిస్ కు గురై చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి పొందుచున్నారు. ఇతనిని శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూమారపు రామంజులు ఎంపీటీసీ ఇడగొట్టు నరసింహులు సీనియర్ నాయకులు మార్పూరి అదిరెడ్డి అయోధ్యపురం శంకర్ రెడ్డి. నాగిరెడ్డి నారాయణ రెడ్డి గాలివీటి రమంజులు రెడ్డి మాజీ ఎంపీటీసీశివ, యువ నాయకులు మజ్జిగ పాల్ రెడ్డి మజ్జిగ సతీష్ కుమార్ రెడ్డి .వుతుకురి ఈశ్వర్ రెడ్డి మాజీఫీల్డ్ అసిస్టెంట్ ఓబులేసు. సాంబశివ మణికంఠ చిన్నరెడ్డయ్య గంగాధర ,రవి ప్రసాద్ ఓబులేసు పత్తి వెంకటేష్ పొసల సీతారామ సి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేల్ మండల పరిధిలోని చెన్నకేశంపల్లిలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జివి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు వచ్చిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమానికి బద్వేల్ తహసిల్దార్ ఉదయ భాస్కర్ రాజు హాజరై మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ సభలను ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలన్నారు. తమ దృష్టికి వచ్చిన కొద్దిపాటి సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నామన్నారు. మరికొన్ని సమస్యలను అతి త్వరలో పరిష్కరించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. భూములకు సంబంధించిన అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి ఏర్పడిన సమస్యలు అన్నింటిని కూడా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమణయ్య రామచంద్రారెడ్డి సుబ్బిరెడ్డి రెవెన్యూ సిబ్బంది తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీకి శిక్షణ

విశాలాంధ్ర-సిద్ధవటం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎగువపేట సిద్ధవటంలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసి) చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ జరిగింది. ఈనాటి శిక్షణ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎగువ పేట,సిద్ధవటం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు అధ్యక్షత వహించారు. శిక్షణ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్ గా సిద్ధవటం మండల విద్యాశాఖ అధికారి విలియం రాజు వ్యవహరించారు. ముఖ్య అతిథిగా మరొక మండల మండల విద్యాశాఖ అధికారి అరుణ విచ్చేశారు. ముందుగా సభ అధ్యక్షులు ఎం. శ్రీరాములు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మరియు ప్రధానోపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఏ పథకం అయినా విజయవంతంగా అమలు జరిపి అనుకున్న ఫలితాలు సాధించాలంటే ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమని అన్నారు.అనంతరం కోర్సు డైరెక్టర్ సిద్ధవటం మండల విద్యాశాఖ అధికారి విలియం రాజు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నెలకొకసారి పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ 2 అరుణ మాట్లాడుతూ, పాఠశాల యాజమాన్యం కమిటీ ప్రతి ఏడాది పాఠశాల అభివృద్ధి ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు. పిల్లల నమోదు చదువు కొనసాగించడం, హాజరు సంబంధించిన విషయాలను ప్రణాళికలో పొందుపరిచి వాటిని ఆచరణలో పెట్టేందుకు ప్రత్యేక వ్యూహాలను అందులో పొందుపరచాలని అన్నారు. తర్వాత జిల్లా రిసోర్స్ పర్సన్ డాక్టర్ మామిడి బాబు మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధిలో ప్రజల తల్లిదండ్రుల పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల ఉపాధ్యాయుల ఆగస్వామ్యాన్ని పెంచడానికి పాఠశాల సామాజిక తనిఖీ అవసరమని అన్నారు. ఇంకా ఈ శిక్షణ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్గా ఎస్.ఖాదర్ వల్లి బి నగేష్ వెంకటసుబ్బయ్యలు వ్యవహరించారు.

వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర–సంబేపల్లె: మండలంలోని ప్రతి ఒక్కరు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యన్.కొండయ్య అన్నారు. గురువారం మోటకట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలోని ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాం 104 మెడికల్ క్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల దగ్గరికే వైద్య సేవల్లో భాగంగా మోటాకట్లలో ఎర్పాటు చేశామని, అన్ని వైద్య సేవలు, రక్త పరీక్షలు ఇక్కడ ఉచితంగా లభిస్తాయని, అందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామంలో వ్యాపిస్తున్న జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా, డెంగీ, చికెన్ గున్య రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వైద్య సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్ర మంలో డాక్టర్ మధు సూదన్ రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్స్ వై. ప్రసాద్ యాదవ్, సూపర్వైజర్ సదాశివరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఏఎన్ఎం పద్మజా, భాగ్యలక్ష్మి, 104 డీఈవో బాలకృష్ణ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర–చెన్నూరు : మండలంలో సమస్యలు ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు గళం ఇప్పుడేమే తప్ప ఆ గళాన్ని పట్టించుకునే అధికారులే కరువయ్యారు. మండలంలో రకాల సమస్యలు పేరుకుపోవడంతో ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వచ్చే సమావేశానికి సమస్యలను పరిష్కరించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అయితే అధికారులు ఆదేశాలను తుంగలో తొక్కారు. సమస్యల పరిష్కారానికి కాసింతైన చొరవ చూపకపోవడంపై ప్రజా ప్రతినిధులు, ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ సమస్యలన్నింటికీ రేపు జరగబోయే సర్వసభ్య సమావేశంలోనైనా పరిష్కారానికి కార్యరూపం దాల్చిన అని మండల ప్రజలు కోరుతున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన జిజిహెచ్ రిమ్స్ అడ్మినిస్ట్రేటర్ రంగ స్వామి..

విశాలాంధ్ర–కడప : కడప నగర శివారులోని ప్రభుత్వ వైద్యశాల రిమ్స్ లో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అసోసియేషన్ క్యాలెండర్ ని జిజిహెచ్ రిమ్స్ అడ్మినిస్ట్రేటర్ రంగ స్వామి ఆవిష్కరించారు. ఆయనకు అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు అసోసియేషన్ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు పి.అమరావతి, కార్యదర్శి పి.లిల్లీ ఫ్లోరెన్స్, కోశాధికారి ఎం.పెర్సీస్, ఉపాధ్యక్షురాలు ఎస్ .పద్మావతి జిల్లా మరియు స్టేట్ ఈసీ మెంబర్ బి. పద్మలత, జిల్లా ఈసీ మెంబర్స్ రామ రంజిత, ఆశాజ్యోతి, షర్మిల, శారద, పంకజం తదితరులు పాల్గొన్నారు.

10న జరిగే ఆందోళనను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర–కడప రూరల్ : అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలము ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు రెండు ఎకరాల సాగు భూమి మంజూరు చేయాలని జనవరి 2 నుండి సిపిఐ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఈనెల 10న మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరుగు ఆందోళనకు వ్యక్తిగత అర్జీలతో రావాలని గురువారం స్థానిక కడప శాంతినగర్ లో అర్జీదారుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇండ్లు ఇస్తాం, ఇంటి స్థలం ఇస్తాం, రేషన్ కార్డుతో పాటు మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, 24 గంటలు త్రాగునీరు అందిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలతో ఓట్లు దండుకొని అధికారంలోకి రాగానే ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి ప్రజలు ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకు నెడుతున్నారని వారు ఆరోపించారు. దశాబ్దాల తరబడి పేదలు సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం కోసం అధికారులు అధికార పార్టీ నేతల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్న ఫలితం దక్కడం లేదన్నారు. గత ఐదు సంవత్సరాల జగన్ పాలనలో జగనన్న కాలనీల పేరుతో కేవలం ఒక సెంటు జాగా ఇచ్చి తక్షణం ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోకపోతే రద్దు చేస్తామన్న షరతులతో భయపడి ప్రజలు ఐదు రూపాయలు పది రూపాయలు వడ్డీలకు అప్పు తెచ్చి కట్టి చేసిన అప్పు తీర్చుకోలేక తాకట్టు పెట్టే పరిస్థితికి వచ్చారన్నారు. నివాసయోగ్యం కానీ ప్రాంతాలలో ఇవ్వడం వల్ల చాలామంది ప్రజలు ఇంటి స్థలాలు తీసుకోవడానికి నిర్మాణం చేపట్టడానికి నిరాకరించారన్నారు. చంద్రబాబు తాను అధికారంలోకి రాగానే గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి 4 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తి చేయిస్తానని ప్రకటించారన్నారు, తన ఎన్నికల వాగ్దానాన్ని తక్షణము అమలు చేయాలని ఇంటి నిర్మాణ వ్యయాన్ని ఐదు లక్షలకు పెంచి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. భూమి లేని నిరుపేదలకు రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలన్నారు. పేదలకు ఇంటి స్థలం ఇవ్వడానికి నిరాకరిస్తున్న అధికారులు కళ్ళముందే విలువైన ప్రభుత్వ వంక వాగో చెరువు రాస్తా, అసైన్డ్, దేవాదాయ, ఈనామ్ , వక్ఫ్ భూములు చివరకు స్మశానాలు కూడా వదలకుండా ఆక్రమించి అమ్ముకునే డీకేటి మాఫియా కొమ్ము కాస్తున్నారన్నారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలం సాగుభూమి సాధనకై పదిన జరిగే తాసిల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమస్యల వలయంలో శాంతినగర్ కడప నగరం నాలుగో డివిజన్ పరిధిలోని శాంతినగర్ నిర్మాణం జరిగిన నాలుగు దశాబ్దాలు కావస్తున్న కనీస మౌలిక వసతులైన రోడ్లు కాలువలు వీధిలైట్లు త్రాగునీటి సౌకర్యం లేక మురికి కుపంగా మారి డెంగ్యూ మలేరియా చికెన్ గున్యా వంటి విష జ్వరాల బారిన పడి ప్రజలు అల్లాడిపోతున్నారని వారు వాపోయారు. గత ప్రభుత్వంలో వర్షపు నీటి కాలువ నిర్మాణం కోసం అంటూ పేదల ఇల్లు గుల్ల చేసి వదిలేశారన్నారు. కాలువ నిర్మాణం పూర్తి చేసి, పగటిపూట నీటిని అందించి, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వెంకటశివ జోన్ కార్యదర్శి శంకర్ నాయక్ బ్రహ్మం నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి

విశాలాంధ్ర–లక్కిరెడ్డిపల్లి : ప్రతి ఒక్కరూ గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సద్దల అహల్య అధ్యక్షతన జరిగిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఆలస్యం కాకుండా త్వరితగిన ప్రజలకు అందించా లన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. టౌన్ పరిధిలోని పొడి చెత్తను తడి చెత్తను వేరు చేసేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లోని విద్యుత్ దీపాలు, ఇతర సమస్యల ను గుర్తించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డయ్య, విస్తరణ అధికారి ఉషారాణి, ఉపసర్పంచ్ రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివిధ అంశాలపై ఆర్డీ సమీక్ష

సంతృప్తికరంగా సాగిన సమావేశం– యంత్రాంగం పనితీరుపై ప్రశంసలు

విశాలాంధ్ర–యర్రగుంట్ల : ఎర్రగుంట్ల నగరపంచాయతీకి సంబంధించిన వివిధ అంశాలపై మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) విశ్వనాథ్ సమీక్ష నిర్వహించారు. గురువారం ఇక్కడి నగర పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీ విశ్వనాథ్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం అయ్యారు. ఆస్తి, నీటి పన్నుల వసూళ్లు, ట్రేడ్ లైసెన్స్ వంటి వాటిపై సమీక్షించారు. అభివృద్ధి పనులపై ఆరా తీయడంతో పాటు పురపాలిక పరిధిలోని సమస్యలపై కూడా చర్చించారు. వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆర్డీ పలు సూచనలు చేశారు. పురపాలిక రాబడిపై దృష్టి సారించడం ద్వారా పట్టణ ప్రజల మౌలిక వసతుల కల్పనకు బాటలు వేయాలన్నారు. ఆదాయ వనరుల పెంపుకు మార్గాలను అన్వేషించాలని సూచించారు. అలాగే సచివాలయాల ఉద్యోగుల విధులు, వారి సమస్యలపై వాకబు చేశారు. ఆర్డీ సమీక్ష ఆద్యంతం సంతృప్తికరంగా సాగడంతో ఇక్కడి అధికారులు, సిబ్బందిని ప్రశంసించారు. కార్యక్రమంలో కమిషనర్ శేషఫణి, మేనేజర్ పుల్లయ్య, ఏఈ సురేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ షూటింగ్ బాల్‌గేమ్స్‌కు హరిబాబు ఎంపిక

విశాలాంధ్ర–పోరుమామిళ్ల రూరల్ : కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల మండలం నాగులుకుంట్ల గ్రామానికి చెందిన రాయపాటి హరి బాబు అనే విద్యార్థి ఇంటర్నేషనల్ షూటింగ్ బాల్ గేమ్స్ కి ఎంపికయ్యారు. తల్లిదండ్రులు రాయపాటి చిన్న అంకాలయ్య, మున్నెల్లి గురమ్మా పెద్ద కుమారుడు రాయపాటి హరిబాబు నిరుపేద కుటుంబానికి చెందినటువంటి విద్యార్థి ఎవరైనా దాతలు సహాయం చేస్తే మంచి ప్రతిభను కనబరిచి మరిన్ని పథకాలు సాధిస్తానని త్వరలో నేపాల్ లో ఇంటర్నేషనల్ గేమ్స్ జరుగుతున్నట్లు తెలిపారు అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగినటువంటి జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ టీం గోల్డ్ మెడల్ సాధించి ఇంటర్నేషనల్ ఎంపిక కావడం జరిగినది జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించి షూటింగ్ బాల్ ఇంటర్నేషనల్ కు ఎంపికయ్యారు త్వరలో జరగబోయేటటువంటి ఇంటర్నేషనల్ షూటింగ్ బాల్ గేమ్స్ కి విద్యార్థి వెళ్తున్నట్లు ఆర్థికంగా ఫోన్ నంబర్ 8179895382, 9014394783 ఎవరైనా సహాయం చేసినట్లయితే మరిన్ని పథకాలు సాధిస్తారని తల్లిదండ్రులు ఓపోతున్నారు.